అటకెక్కిన అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి

- నిలిచిన నాడు–నేడు పనులు
- అద్దె గదుల్లోనే కేంద్రాలు

క్లస్టర్	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	అద్దె గదుల్లో ఉన్నవి
ముత్తుకూరు	23	5
పంటపాళెం	24	2
పిడతాపోలూరు	26	3

ముత్తుకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలనే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలను కూడా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. నాడు–నేడు రెండో విడత ద్వారా ఈ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. 2023–24 సంవత్సరంలో ముత్తుకూరు మండలంలో 40 పాఠశాలలు, 6 అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చేందుకు పనులు చేపట్టారు. ఇందుకోసం రూ.11.75 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇందులో భాగంగా మొదటి విడతలో దువ్వూరువారిపాళెం, బ్రహ్మదేవి గిరిజనకాలనీ, దిబ్బమీద దళితవాడ, బండ్లపాళెం, మామిడిపూడి దళితవాడ, పొట్టెంపాడు అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు.


బ్రహ్మదేవి గిరిజనకాలనీలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం


వల్లూరు ఎస్సీ కాలనీలో అద్దెగదిలోని అంగన్‌వాడీ కేంద్రం

సర్కారు మారింది – పనులు ఆగింది

నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందే దశలో ఎన్నికలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అప్పటికే ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రానికి రూ.4.25 లక్షలు మాత్రమే విడుదల కావడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం చాలీచాలని వసతులతో కొట్టుమిట్టాడుతున్నాయి. కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. బండ్లపాళెం కేంద్రం మాత్రం పూర్తయ్యే దశకు చేరింది.


అసంపూర్తిగా ఉన్న మామిడిపూడి అంగన్‌వాడీ కేంద్రం

మిగిలిపోయిన పనులు పూర్తి చేయాలి



నాడు–నేడు కార్యక్రమం ద్వారా గత ప్రభుత్వం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. ఎన్నికల తర్వాత వీటి పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేసి, మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలి.

– కట్టా సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్, బ్రహ్మదేవి

శాశ్వత భవనాలు నిర్మించాలి



వల్లూరు పంచాయతీలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి శాశ్వత భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇందుకు కావాల్సిన నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేయాలి.

– పెంచల ప్రతాప్, సర్పంచ్, వల్లూరు

క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం


కాలి బూడిదైన ఇంటి సామగ్రి

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు దళిత కాలనీలో మంగళవారం వేకువజామున ఓ పూరిల్లు దగ్ధమైంది. బాధితుల కథనం మేరకు.. ఆమారి మల్లికార్జున్–శారదమ్మ దంపతులు వ్యవసాయ పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భోజనం అనంతరం కుమారుడు తమ పూరింట్లో నిద్రపోగా దంపతులిద్దరూ ఇంటి బయట నిద్రపోయారు. సరిగ్గా అర్ధరాత్రి 2 గంటల సమయంలో సిలిండర్ పేలి పూరింటికి నిప్పులు అంటుకున్నాయి. తేరుకున్న దంపతులు వెంటనే ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడిని బయటకు తీసుకొచ్చారు. చిన్నగా మొదలైన మంటలు ఇంటిని చుట్టుముట్టి పూర్తిగా కాల్చి బూడిద చేశాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా నిలువరించారు. ఈ ఘటనలో రూ.90 వేల నగదుతో పాటు రూ.3 లక్షల విలువ చేసే ఇంటి సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితులు వాపోయారు.

గణేశ్ లడ్డూ @ రూ.3.06 లక్షలు



మనుబోలు : స్థానిక బీసీ కాలనీ సమీపంలోని విశ్వనాథస్వామి ఆలయం వద్ద గణనాథునికి మంగళవారం రాత్రి నిమజ్జనోత్సవం నిర్వహించారు. తొలుత వినాయకుని లడ్డూకు వేలం నిర్వహించగా రూ.3.06 లక్షలకు కుడితిపల్లి గ్రామానికి చెందిన గుండుబోయిన వెంకటేశ్వర్లు దక్కించుకున్నారు. అలాగే గణనాథుని మెడలో వేసిన వెయ్యి విలువైన నగదు మాలకు వేలం వేయగా రూ.2.25 లక్షలకు బండేపల్లికి చెందిన మేకల యోగేశ్వర్రావు దక్కించుకున్నారు. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

పొదలకూరు : విజయవాడ వరద బాధితులకు స్థానిక అమరావతి స్కూల్ విద్యార్థులు ఆర్థిక సాయాన్ని అందించారు. విద్యార్థులు వసూలు చేసిన రూ.2,41,001 నగదును డీడీ రూపంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పాఠశాల కరస్పాండెంట్ కె.సురేష్, ఉపాధ్యాయులు మంగళవారం అందజేశారు. చాటగొట్ల గ్రామ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే డీడీని స్వీకరించారు.

ఆంజనేయస్వామికి పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, సాయంత్రం ప్రత్యేక పూజల గావించారు.

విద్యార్థులపై శ్రద్ధ ఉండాలి

పొదలకూరు : విద్యార్థుల చదువుపై వారి తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. కాలేజీలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర చాలానే ఉందన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తనకు తన కుటుంబానికి ఓ వ్యక్తి నుంచి ప్రాణహాని ఉందని ఓ మహిళ మంగళవారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ కథనం మేరకు.. పట్టణంలోని రామకృష్ణనగర్‌లో హేమలత, మహీంద్ర దంపతులు 14 ఏళ్లుగా ఉంటున్నారు. వవ్వేరుకు చెందిన కోలా మహేష్ అనే వ్యక్తి మహీంద్ర ఇంటి పక్కన ఓ ఇంటిని కొన్నాడు. అప్పటి నుంచి తమను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ప్రశ్నిస్తే రౌడీలను తీసుకొచ్చి దౌర్జన్యానికి దిగుతున్నారని తెలిపారు. ఇల్లు ఖాళీ చేయకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సివిల్ కేసు తమకు సంబంధంలేదనే సమాధానం ఇచ్చారని వివరించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

మద్యం షాపు సిబ్బంది ఆందోళన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్స్, సేల్స్‌మెన్ మంగళవారం పట్టణంలో ఆందోళన చేపట్టారు. ర్యాలీగా బయలుదేరి దేవరపాళెంలోని మద్యం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ ప్రభుత్వం తమను విధుల నుంచి తొలగించడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు బత్తల నరేంద్ర, అంకయ్య, కిశోర్, ప్రశాంత్, దయాకర్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

పొదలకూరు : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి మంగళవారం తెలిపారు. సమావేశంలో సీజనల్ వ్యాధులు, గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచులు, సెక్రటరీలు, వీఆర్వోలు, మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఎంపీడీఓ నగేష్‌కుమారి బదిలీ

పొదలకూరు : ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి విడవలూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ నరసింహారావు బదిలీపై వస్తున్నారు. అయితే నెలాఖరు వరకు ఇద్దరు ఎంపీడీఓలు వారి స్థానాల్లో ఉంటారని తెలిసింది.

విద్యార్థులకు అభినందన

మనుబోలు : మనుబోలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. మనుబోలులోని శుశృత ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులైన గుంజి అఖిల్, చిలకూరు గౌతమ్‌లు ఈనెల 20వ తేదీ మనుబోలులో జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటి నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. పొదలకూరులో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో పాఠశాల ప్రిన్సిపల్ ఫరీద్ మంగళవారం విద్యార్థులను అభినందించారు.

కాకాణికి పలువురి అభినందన

ముత్తుకూరు : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ముత్తుకూరు ఎంపీపీ గండవరం సుగుణ మంగళవారం అభినందించారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య తదితరులు ఉన్నారు.

- **పొదలకూరు :** పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పొదలకూరు మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి కలిశారు. ఈ సందర్భంగా సత్కరించారు. కాకాణిని కలిసిన వారిలో బిరదవోలు, మొగళ్లూరు, విరువూరు, తాటిపర్తి తదితర గ్రామాల నాయకులు ఉన్నారు.
- **మనుబోలు :** మండలంలోని జట్లకొండూరు వాసులు నెల్లూరులోని కాకాణి నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం, నాయకులు కట్టుమూరి శ్రీనివాసులు, ఆవుల రమేష్, వీరయ్య, బాబూరావు, జగదీష్, సంతోష్ తదితరులు ఉన్నారు.


ముత్తుకూరు : కాకాణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీపీ సుగుణమ్మ


పొదలకూరు : కాకాణిని సత్కరిస్తున్న మండల నేతలు


మనుబోలు : కాకాణితో జట్లకొండూరు నాయకులు

ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

విడవలూరు : స్థానిక పీఆర్ఆర్– వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కోవూరు : మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పడుగుపాడులో మంగళవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలుత కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, మైనారిటీ నేతలు జమీర్, మసూద్, జహంగీర్ పాల్గొన్నారు.

మెప్మా సీఎంఎంగా అంకయ్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ మెప్మా సిటీ మిషన్ మేనేజర్‌గా అంకయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రాథమిక దశలో కేన్సర్‌కు చికిత్స

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

కొడవలూరు: కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే తెలుసుకోవడం వల్ల సులువుగా చికిత్స చేసుకోవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య అన్నారు. కొడవలూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రధానంగా 30 ఏళ్ల పైబడిన మహిళలు విధిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట కొడవలూరు, యల్లాయపాళెం వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, పి.కావ్య, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్ఎస్ వి.రామ్మోహన్, హెచ్ఏలు వెంకట్రావు, షఫీ ఉద్దీన్, సుధాకర్ ఉన్నారు.


కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

పేదలకు ఉచిత న్యాయ సహాయం

ఇందుకూరుపేట : ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన పేదలకు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ప్రభుత్వం ఉచిత న్యాయ సహాయం అందిస్తోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఇందుకూరుపేట దళితవాడలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎక్కడైన పరిష్కారం కాని సమస్యలను లోక్‌అదాలత్ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, ఏఎస్ఐ భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

వ్యవసాయానికి పెద్దపీట


పొదలకూరు : గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు : కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాటగొట్ల గ్రామంలో వ్యవసాయ శాఖ నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానశాఖల ద్వారా రైతులకు రాయితీలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామస్తులు అందజేసిన అర్జీలను స్వీకరించారు. అధికారులు, నాయకులు ఉన్నారు.


కొడవలూరు : నాగలితో పొలాన్ని దున్నుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

అధికారుల సూచనలతో సత్ఫలితాలు

కొడవలూరు : వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగు చేస్తే మరింత సత్ఫలితాలు ఉంటాయని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని రామన్నపాళెంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలతో ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఏఓ పి.సత్యవాణి, ఏడీఏ డి.సుజాత, ఏఓ లక్ష్మి, నాయకులు దేగా దయాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కాకి శ్రీనివాసులు, డి.విజయకుమార్‌రెడ్డి, తువ్వర ప్రవీణ్‌కుమార్, విశ్వనాథ్, కె.మల్లికార్జున పాల్గొన్నారు.

బీసీ కాలనీలో వైద్య శిబిరం

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బాణసంచా పేలుడు బాధితుల కోసం మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్, ఈఎన్‌టీ అండ్ నెక్ క్లినిక్ ఆధ్వర్యంలో వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పదుల సంఖ్యలో చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సల కోసం సిఫార్సు చేశారు. జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రసాద్, జాకీర్, పవన్, కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కోవూరులో కార్డన్ సెర్చ్

కోవూరు : కోవూరు పరిధిలోని స్టాబీడీ కాలనీ, లక్ష్మీనారాయణపురంలో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్సైలు, సీఐలు, సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిపి 150 మంది తెల్లవారుజామున సుమారు 1,200 ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన పత్రాల్లేని 50 బైక్‌లు, ఆరు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

వరిలో విత్తనశుద్ధి తప్పనిసరి

- ఏడీఏ రాజ్‌కుమార్

తోటపల్లిగూడూరు : వరిసాగులో విత్తన శుద్ధి తప్పనిసరి అని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సంచాలకుడు(ఏడీఏ) రాజ్‌కుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నరుకూరు, పేడూరు గ్రామ సచివాలయాల్లో మంగళవారం గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రబీ సీజన్‌కు సంబంధించి సాగు పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు, సలహాలను అందించేందుకు పొలం పిలుస్తోంది గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తన శుద్ధితో పాటు నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం స్థానిక పంట పొలాల్లో వ్యవసాయాధికారులు క్షేత్ర సందర్శన చేపట్టి రైతులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌కుమార్, మండల ఏఓ శిరీషారాణి, వీఏఏ నిరూష, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా రైతులు లైసెన్సులు పొందాలి

ముత్తుకూరు : ఆక్వా రైతులు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని ఫిషరీస్ అసిస్టెంట్లు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పంటపాళెం, నారికేళపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్‌నాయక్, మండల ఏఓ జ్యోత్స్నరాణి, సచివాలయ పశుసంవర్ధక, ఫిషరీస్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. వేరుశనగ, ఆక్వా రైతులతో మాట్లాడారు. సర్కారు ల్యాబొరేటరీల్లో అన్నిరకాల నీటి పరీక్షలు చేస్తారని వెల్లడించారు. వేరుశనగ విత్తన శుద్ధి చాలా అవసరమన్నారు. రైతులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఇందుకూరుపేట: పొలం పిలుస్తోంది గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఏఓ డి.రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందుకూరుపేట, జంగంవానిదొరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సాగుకు సంబంధించిన అంశాలపై రైతులకు సూచనలు చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ మురళీకృష్ణ, మత్స్యశాఖ అసిస్టెంట్ హేమలత, ఉద్యానశాఖ అధికారి ఝాన్సీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెం, కాగులపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మండల ఏఓ ఎం.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి ఆదాయం పెంచడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించామని వివరించారు. అనంతరం సాగులో ఉన్న బంతి, మొక్కజొన్న పంటలను సందర్శించారు. కార్యక్రమంలో అధికారులు రవిచంద్ర, కల్యాణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

- **విడవలూరు:** స్థానిక రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై మండల ఏఓ పి.వెంకట కృష్ణయ్య మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధవారం గ్రామాల్లోని రైతులకు సాగుపై సూచనలు, సలహాలు అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాసులు, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ

మనుబోలు : రైతులు నారుమళ్లు వేసే ముందు విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా పైరు దశలో వచ్చే చీడపీడలను నివారించవచ్చని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఏఓ షేక్ జమీర్ అన్నారు. మనుబోలు సచివాలయం–1 పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసుకుంటే పైరుకు ఆశించే చీడపీడలను కనీస స్థాయికి తగ్గించవచ్చని, తద్వారా రైతులకు పురుగు మందుల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. ఏఈఓ కళారాణి, టీడీపీ నాయకులు ఉన్నారు.


తోటపల్లిగూడూరు : నరుకూరు పంట పొలాల వద్ద సలహాలు చేస్తున్న వ్యవసాయాధికారులు


ముత్తుకూరు : రైతులతో చర్చిస్తున్న వ్యవసాయ, ఫిషరీస్ అసిస్టెంట్లు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బంతిసాగును పరిశీలిస్తున్న అధికారులు


ఇందుకూరుపేటలో..